తీరని లో ఓల్టేజీ సమస్య

- భగత్‌సింగ్ కాలనీలో దుస్థితి
- ఏళ్లుగా వెంటాడుతున్న సమస్య
- అలంకారప్రాయంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- ప్రదక్షిణలు చేస్తున్నా కరుణించని అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని ఆ శాఖ ఉన్నతాధికారులు తరచూ ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. లో ఓల్టేజీ సమస్య ఏళ్లుగా నెలకొందని, దీన్ని పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, ఎలాంటి ప్రయోజనం లభించడంలేదు.

ఇదీ తీరు..

గత వేసవిలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య కారణంగా 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీలో రాత్రి వేళ ఇంట్లో లైట్లు వెలగక.. ఫ్యాన్లు తిరగక ప్రజలు ఇబ్బంది పడ్డారు. చివరికి విసిగివేసారి సబ్‌స్టేషన్ వద్దకొచ్చి ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో ఇలాంటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ లాగేందుకు కండక్టర్, సామగ్రిని ఉన్నతాధికారులు మంజూరు చేశారు.


సబ్‌స్టేషన్లో అలంకారప్రాయంగా ట్రాన్స్‌ఫార్మర్


నిరుపయోగంగా పరికరాలు

ఇవి వచ్చి నెలవుతున్నా, ఇప్పటికీ ఏర్పాటుకు నోచుకోలేదు. సబ్‌స్టేషన్లోనే ఇవి దర్శనమిస్తున్నాయి. తమ సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందంటూ ఏఈని భగత్‌సింగ్‌కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

కరెంటాఫీస్ చుట్టూ తిరిగినా ప్రయోజనమేదీ..?



జనార్దన్‌రెడ్డికాలనీలోని కరెంటాఫీస్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. చూస్తాం .. చేస్తామంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు వచ్చాయని చెప్తున్నారే తప్ప, వాటిని బిగించడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడంలేదు.
– సర్దార్

మూడేళ్లుగా అల్లాడుతున్నాం



రాత్రీ, పగలనే తేడా లేకుండా లో ఓల్టేజీ సమస్య మూడేళ్లుగా వేధిస్తోంది. వేసవిలో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. ఫ్యాన్లు తిరగకపోవడంతో అల్లాడుతున్నాం. రాత్రి వేళ బెడ్ లైట్లు వెలగడమూ గగనమవుతోంది. మా ఇబ్బందులను పట్టించుకునేవారే కరువయ్యారు.
– ఆయేషా

గృహోపకరణాలు కాలిపోతున్నాయి



లో ఓల్టేజీ కారణంగా ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఇటీవలే మోటార్ సైతం కాలిపోయింది. వేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టి, వైర్లు లాగితే మాకు మంచి కరెంట్ వస్తుందని చెప్తున్నారే తప్ప, ఆ పనిని మాత్రం చేయడంలేదు.
– బాను

అతి త్వరలో ప్రారంభిస్తాం



భగత్‌సింగ్ కాలనీలో లో ఓల్టేజీ సమస్య నెలకొన్న విషయం నా దృష్టికొచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్, మెటీరియల్‌ను మంజూరు చేశాం. కొన్ని కారణాలతో పనులు చేయడంలో జాప్యం జరిగిన మాట వాస్తవమే. అతి త్వరలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.
– శ్రీధర్, ఈఈ, నెల్లూరు టౌన్

నిధుల దుర్వినియోగంపై విచారణకు వినతి

నెల్లూరు రూరల్: బీసీ మహిళల ఆర్థిక చేయూత నిమిత్తం కుట్టు మెషీన్లు ఇచ్చి టైలరింగ్ నేర్పించడం కోసం ప్రైవేట్ ఏజెన్సీలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లు దుర్వినియోగమయ్యామని, ఈ అంశంపై విచారణ జరిపించాలని బీసీ సంఘ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు మద్దులూరు సుభాష్‌యాదవ్ కోరారు. ఈ మేరకు జేసీ కార్తీక్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యోషన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల హరీష్, రాష్ట్ర నేతలు రాచూరు మురళీకృష్ణయాదవ్, లక్ష్మీకాంత్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



నెల్లూరు రూరల్: కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ కృష్ణకాంత్‌ను ఆయన క్యాంప్ కార్యాలయంలో కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు వివిధ అంశాలపై చర్చించారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి

నెల్లూరు రూరల్: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అసువులు బాసిన వారికి బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు మిడతల రమేష్, నరాల సుబ్బారెడ్డి, సమాధి శ్రీనివాస్‌యాదవ్, రామ్మోహన్, కృష్ణసింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ఏసీనగర్‌లోని రత్నం హైస్కూల్ విద్యార్థులు శ్రీజ, నిత్యశ్రీ, గీతిక, సూర్యతేజను బాలాజీనగర్ సీఐ సాంబశివరావు శుక్రవారం అభినందించారు. కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను చెల్లించాలి

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత విద్యను అందిస్తున్నామని, దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. అప్సా జిల్లా ప్రధాన కార్యదర్శి నందకిశోర్, నేతలు సుల్తాన్, సుబ్బయ్య, రమణకుమార్, కొండారెడ్డి, చాట్ల రాజేష్, పద్మజారెడ్డి, శివకుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన రమణయ్య (40) గ్రామానికి చెందిన ఇద్దరితో కలిసి గూడూరులో పాట్లేళ్ల కొనుగోలుకు ఆటోలో గురువారం రాత్రి బయల్దేరారు. నేషనల్ హైవే ఆఫీస్ ఎదురుగా రోడ్డుపై గుంతల్లో ఆటో పడింది. దీంతో ప్రమాదశాత్తూ రమణయ్య కిందపడగా, తలకు తీవ్రగాయమైంది. ఈ క్రమంలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి.. హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, కుమారుడున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు

నెల్లూరు(బారకాసు): కొండాయపాళెం, భక్తవత్సల నగర్ రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రైల్వే, ఆర్టీఓ, కార్పొరేషన్, విద్యుత్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో అండర్ బ్రిడ్జిలకు అనుమతులను కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

28న తాగునీటి సరఫరాకు అంతరాయం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని హెడ్ వర్క్స్‌కు సంబంధించిన టౌన్ సప్లయ్ స్లూయిజ్ వాల్వ్‌ను భర్తీ చేయనున్న క్రమంలో తాగునీటి సరఫరాకు ఈ నెల 28న అంతరాయం ఏర్పడనుందని ఎస్‌ఈ రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటమిట్ట, పెద్దబజార్, ఆచారి వీధి, ముంగమూరివారివీధి, కామాటివీధి, చాకలివీధి, కాపువీధి, సుబేదారు పేట, కపాడిపాళెం, చిన్నబజార్, సంతపేట, బృందావనం, పొగతోట తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. మరుసటి రోజు నుంచి సరఫరా యథావిధిగా ఉంటుందన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న సుజాత

నెల్లూరు(అర్బన్): మలేరియా వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీని వైద్య సిబ్బంది, అధికారులతో కలిసి శుక్రవారం చేపట్టారు. అనంతరం కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. చలి, వణుకుతో కూడిన జ్వరమొస్తుందని, ఇలాంటి లక్షణాలుంటే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డాక్టర్ దయాకర్, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, అసిస్టెంట్ మలేరియా ధికారి నాగార్జునరావు, డెమో అధికారి కనకరత్నం, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారు, మీనాక్షి సుందరేశ్వర స్వామిని రాష్ట్ర సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వచనాలను ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు.

కులదూషణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వీఆర్వోను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసును దర్గామిట్ట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన వెంకటరమణయ్య నెల్లూరు బిట్ – 1 ఇన్‌చార్జి వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి మారుతిప్రసాద్ బుధవారం వచ్చారు. అక్కడి రెవెన్యూ సిబ్బందిని దుర్భాషలాడుతుండగా, వెంకటరమణయ్య అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన మారుతిప్రసాద్.. బయటకు రానీ సంగతి తేలుస్తా అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి విధులు ముగించుకొని కార్యాలయం నుంచి బయటకు వెంకటరమణయ్య వెళ్తుండగా, గేట్ వద్ద అడ్డుకొని కులంపేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

వేడుకగా పేట ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యులు వారి అవతారోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమంజనం, పేట ఉత్సతం తదితరాలను శుక్రవారం జరిపారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో.. మద్యం మత్తులో ఊపిరాడకో స్పష్టంగా తెలియదు గానీ గుర్తుతెలియని వ్యక్తి ఇందిరాభవన్ రోడ్డులోని ఓ హాస్పిటల్ సమీపంలో శుక్రవారం మృతి చెందారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల లోపు ఉంటుంది. నలుపు రంగు ప్యాంట్, ఎరుపు, లేత నీలి రంగు చారలున్న ఫుల్ హ్యాండ్స్ చొక్కాను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న సంతపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరాతీయగా, మృతుడు స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ వచ్చిన సంపాదనతో మద్యం తాగేవారని, రాత్రి వేళ దుకాణాలు, హాస్పిటల్స్ బయట నిద్రించేవారని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు.

వ్యభిచార కేంద్రాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): మధురానగర్‌లో మూడు వ్యభిచార కేంద్రాలపై పోలీసులు దాడులు జరిపారు. పోలీసుల సమాచారం మేరకు.. మధురానగర్‌లో మూడిళ్లను అల్లీపురానికి చెందిన పొట్టెయ్య అలియాస్ పొట్టయ్య, అల్లీపురం, కిసాన్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఏడాది క్రితం అద్దెకు తీసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి సెక్స్ వర్కర్లను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కేంద్రాలను నిర్వహించసాగారు. దీనిపై నవాబుపేట ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సాంబశివరావుకు పక్కా సమాచారం అందింది. ఈ క్రమంలో మూడిళ్లపై ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ఎస్సై శివయ్య తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు నిర్వాహకులు, నలుగురు విటులను అరెస్ట్ చేశారు. రూ.3,770ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకుని హోమ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో నిర్వాహకురాలి కోసం గాలిస్తున్నారు.

- కొండాయపాళెంలోని కావేరినగర్‌లో ఇళ్ల మధ్య నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై దాడులను వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు జరిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన నిర్వాహకుడు ఖాజావలీ, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. సెక్స్ వర్కర్‌ను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సిద్ధి విఘ్నేశ్వరాలయ వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): చైత్ర బహుళ ద్వాదశిని పురస్కరించుకొని పప్పులవీధిలోని సిద్ధి విఘ్నేశ్వరాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అభిషేకాలు, కలశ పూజలు, హోమాలు, మహాకుంభాభిషేకాలను జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామివారికి నూతన స్వర్ణ మకర తోరణాన్ని సమర్పించారు. 2.1 లక్షల మల్లెపూలతో పుష్పయాగాన్ని కనులపండువగా నిర్వహించారు. ఏకాంతసేవను రాత్రి జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బయ్యా ప్రసాద్, పాండురంగ అన్నదాన సమాజ కమిటీ అధ్యక్షుడు మెంటా నరసింహారావు, కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పాదర్తి బాలాజీ, కొలిపర్తి అనిల్‌కుమార్, సొల్లేటి సత్యనారాయణ, సోమిశెట్టి కిశోర్‌బాబు, వనమా సురేష్‌కుమార్, పబ్బిశెట్టి లీలామోహన్, శ్రీనివాసులు తదితరులు పర్యవేక్షించారు.

వేడుకగా రాహుకాల పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో రాహుకాల పూజలను శుక్రవారం నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై దీపాలను వెలిగించారు. దేవస్థాన ప్రాంగణంలో కొలువైన మీనాక్షి సుందరేశ్వరుడికి పూజలు తదితరాలను జరిపారు. పల్లకిసేవను వేడుకగా నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని వివిధ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్, వేపదొరువు, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సరస్వతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్, రామ్‌నగర్, ఓల్డ్ మిలటరీ కాలనీ, క్రాంతి నగర్, టెక్కేమిట్ట తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- నవబాల ఫీడర్‌లో కొమ్మల తొలగింపు కారణంగా శివగిరి కాలనీ, సాయినగర్, మహేశ్వరినగర్, ఇరుగాళమ్మ సంఘం తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. మాగుంట లేఅవుట్, మినీబైపాస్, కొండాయపాళెం, వనంతోపు సెంటర్, సప్తగిరి కాలనీ, సంఘమిత్ర స్కూల్, నక్కలగుంట, అన్నమయ్య సర్కిల్, బీవీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి 11.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పార్కుల్లో మెరుగైన వసతులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితరాలను కల్పించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని 4, 5, 9వ డివిజన్లలో గల జాకీర్‌హుస్సేన్‌నగర్, సత్యనారాయణపురం, రేబాల వారి వీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ రహంతుజానీ, డీఈఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

- నగరంలో మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని స్థానిక పరిశ్రమలకు సరఫరా చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. కృష్ణపట్నం పోర్టు, తదితర పరిశ్రమల ప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులతో తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుద్ధి చేసిన నీటిని కృష్ణపట్నం పోర్టు ప్రాంతానికి సరఫరా చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, డీఈఈలు సుదేష్ణ, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న నందన్

- డీఆర్డీఓ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు సతీష్‌రెడ్డిని టెక్కేమిట్టలోని ఆయన నివాసంలో కమిషనర్ నందన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలను తెలియజేశారు.
- టౌన్ ప్లానింగ్ విభాగ అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

సాయిసత్సంగ్ సమావేశాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): సాయినాథుని బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని ఉపన్యాసకుడు శ్రీశైలం సాయిదాస్ పేర్కొన్నారు. విజయమహల్ గేట్ సమీపంలోని నేతాజీ పైలట్ స్కూల్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాయిసత్సంగ్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిదర్బార్ అద్దాల మందిర నిర్వాహకుడు మధుసాయి మాట్లాడారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. తొలుత సాయినాథుడి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. కర్లపూడి కృష్ణ సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



‘జయభారత్’కు లేజర్ మెషీన్ వితరణ

నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో గల నేత్ర విభాగానికి రూ.పది లక్షల విలువజేసే యాగ్ లేజర్ మెషీన్‌ను హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరెటరీ అధినేత ప్రసాద్‌రెడ్డి అందజేశారు. యంత్రాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆస్పత్రి ట్రస్ట్ జనరల్ సెక్రటరీ హరికుమార్‌రెడ్డి మాట్లాడారు. ఆస్పత్రిలో నేత్ర శస్త్రచికిత్సలను ఉచితంగా చేస్తున్నామని వివరించారు. అనంతరం డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడారు. నేత్ర ఆపరేషన్ తర్వాత కొందరికి వచ్చే పొరలను ఈ మెషీన్ ద్వారా తొలగించొచ్చని చెప్పారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, ఆరెస్సెస్ నేత బయ్యా వాసు, జీఎం గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ



నెల్లూరు(అర్బన్): కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. దర్గామిట్టలోని సంఘ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ సాగింది. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, నేతలు బండారుపల్లి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నందిమండలం ఆంజనేయవర్మ, లక్కాకుల పెంచలయ్య, ప్రసాద్‌రెడ్డి, కరుణమ్మ, నవోదయ, లక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.